

డీకేతో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేల భేటీ

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌తో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. సోమవారం సదాశివనగర్‌లోని డీకే ఇంటికి ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరాం హెబ్బార్‌లు వెళ్లి రహస్యమంతనాలు జరిపారు. ఏడాది క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో వీరిద్దరూ బీజేపీ నుంచి గెలుపొందినా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటు వస్తున్నారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లోనూ ఎస్‌టీ సోమశేఖర్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడగా శివరాం హెబ్బార్ ఓటుకు దూరంగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది.

కనుమరుగవుతున్న చెరువులు..!



నీరు లేక ఎండిపోయిన వైట్‌ఫీల్డ్ సమీపంలోని నల్లూరహళ్లి చెరువు



- నగరంలో మాయమవుతున్న చెరువులు
- నీరు లేక కొన్ని..అభివృద్ధితో మరికొన్ని
- నగర పరిధిలో బోర్లలో ఇంకిపోతున్న నీరు..
- సంరక్షించుకోవాలంటున్న జల నిపుణులు



బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెరువుల నగరిగా శతాబ్దాల చరిత్ర ఉంది. అయితే ఇటీవల చెరువులు కనుమరుగు కావడం ఆందోళన రేకెత్తిస్తోంది. గత ఏడాది నగరంలో తీవ్రమైన కరువు కారణంగా నగర పరిధిలోని 125 చెరువులు నీరు లేక ఎండిపోతున్నాయి. గతంలో చెరువులు కళకళ లాడేవి. ఈ ప్రభావంతో చెరువుల చుట్టూ ఉండే బోర్లలో సమృద్ధిగా నీరు లభించేది. చెరువులలో నీటిమట్టం నవంబరు నాటికే అడుగంటింది. ఇటీవల మూడు నెలలకుపైగా ఎండవేడిమికి ఉన్ననీరు ఇంకిపోయి బీటలుబారే పరిస్థితి ఏర్పడింది. ఇదే నగరానికి పెను షాక్‌ను ఇచ్చే అంశంగా మారింది. నగర పరిధిలో ఉండే చెరువులు ఎండిపోవడంతో బోరుబావుల నీటిపైనే ఆధారపడిన వేలాది కుటుంబాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు పాటుపడాల్సి వచ్చింది.

- మల్లతహళ్ళి చెరువు 71 ఎకరాల విస్తీర్ణం ఉండగా నీరు లేక పోవడంతో వేలాది పక్షులు ఆశ్రయం కోల్పోయాయి. బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు ఈ చెరువు అభివృద్ధికి రూ.81కోట్లు గ్రాంటు మంజూరు చేశారు. అన్నపూర్ణేశ్వరినగర్ చెరువు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా చెరువు ప్రాంతంలోనే బీడీఏ సైట్‌లు, పార్క్, రోడ్డుకు ఉపయోగించారు. బ్యాటరాయనపుర పరిధిలోని రాచేనహళ్ళి చెరువు 148 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా అపార్ట్‌మెంట్‌ల కలుషిత నీరు చేరడంతో ఇది వ్యర్థంగా మారిపోతోంది.
- 1400 ఏళ్ల చరిత్ర కల్గిన యడియూరు చెరువు వారాంతంలో బోటింగ్, వాకింగ్‌లకు వేలాదిమంది వచ్చేవారు. చెరువులో నీరు లేకపోవడంతో వెలవెలబోతోంది. భైరసంద్ర చెరువు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా నీరు లేక వాకర్స్‌కు అనుకూలంగా మారింది. 21 ఎకరాల విస్తీర్ణంలోని దొడ్డకల్లసంద్ర చెరువు నీరు లేక అధ్వానంగా మరగా అపార్ట్‌మెంట్‌లనుంచి వచ్చే కలుషితంతో ఉనికి కోల్పోతోంది. 354 రకాల మొక్కలు, 59 రకాల పక్షులు ఇక్కడ చెరువులో ఉండేవి. ఎండలకు ఎండిపోయింది. చుంచుగట్టె చెరువు 20 ఎకరాలలో ఉండగా నీరు లేని కారణంగా చెత్త డంపింగ్‌గా మారిపోతోంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. చెరువులలో కలుషితాన్ని తొలగించకపోతే నీరు చేరినా వృథా కానుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను కాపాడు కోవాలని జలనిపుణులు పిలుపునిస్తున్నారు.



జలకళతో హెబ్బాళ్ చెరువు (ఫైల్)

- దశాబ్దాల క్రితం బెంగళూరులో వెయ్యికి పైగా చెరువులు ఉండేవి. 1960నాటికి చెరువులసంఖ్య 280కు తగ్గింది. ఆ తర్వాత జనాభా పెరగడంతో చెరువులను మూసివేసి లే అవుట్‌లు, అపార్ట్‌మెంట్‌లు, మాల్స్‌తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు చెరువుల ఉనికి లేకుండా చేశారు. నగరంలో ఉండే కొన్ని చారిత్రాత్మక చెరువులు నీరు లేక పోయాయి. రాజరాజేశ్వరినగర పరిధిలోని హలగ ఒడరే హళ్ళి చెరువు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఈ చెరువు ఎండిపోయింది.

వరద నివారణకు రూ.3 వేల కోట్లు

- నగరంలో వరద నివారణ చర్యలు అమలు చేసేందుకు 3వేల కోట్ల రూపాయలు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు వరల్డ్‌బ్యాంకుతో ఒప్పందం చేసుకుంది. బెంగళూరులో గడిచిన మూడేళ్లక్రితం సర్జాపుర, ఉత్తరహళ్ళితోపాటు పలుచోట్ల వరదనీరు ప్రభావం చూపి వేలాదిఇళ్లకు నీరు చేరిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో అటువంటి పరిస్థితి తలెత్తకుండా శాశ్వతమైన నివారణ చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు అనుగుణంగానే ఏకంగా 3వేల కోట్ల రూపాయలతో శాశ్వతమైన పనులు చేపట్టదలిచారు. చెరువులకు చేరే నీరు సజావుగా పంపడం, రాజకాలువలను అభివృద్ధి చేస్తే చెరువుల మనుగడ సాధిస్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

విజయం మాదే..!

- సేవా గుణం కలిగిన వారికే ఎమ్మెల్సీ టిక్కెట్లు..
- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం
- సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం తమదేనని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల అభ్యర్థి రామోజీగౌడ, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి బీటీ శ్రీనివాస్‌లు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థుల ఊరేగింపులో పాల్గొన్న సీఎం సిద్ద రామయ్య మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు అభ్యర్థులూ సమర్థులని అందుకే ఎంపిక చేసి టిక్కెట్‌లు ఇచ్చామన్నారు. ఇద్దరు విజయం సాధిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మంత్రులు మునియప్ప, రామలింగారెడ్డి, మధుబంగారప్ప, నజీర్ అహ్మద్‌లు పాల్గొన్నారు. అభ్యర్థులను ఆరు నెలలక్రితమే ఖరారు చేశారు. దీంతో ప్రచార ప్రక్రియ సుదీర్ఘకాలంగా కొనసాగించారు. రామోజీగౌడ ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయనకు పట్టభద్రుల సమస్యలు తెలుసని డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. ఇక శ్రీనివాస్ రాజకీయాల్లో అనుభవం కల్గినవారని కొనియాడారు. ఎమ్మెల్సీ పుట్టణ్ణ, మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి, రక్షా రామయ్య, హెచ్‌ఎం రేవణ్ణ, పూర్ణిమా శ్రీనివాస్ పాల్గొన్నారు.



నామినేషన్ల అనంతరం అభ్యర్థులతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

అదృశ్యమైన ముగ్గురు చిన్నారులు..
మృతదేహాలై తేలారు..!

- పిల్లల మృతితో కుటుంబాల్లో విషాదం
- నీటి శుద్ధి కేంద్రంలో జారి పడి ప్రమాదం
- రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ముగ్గురు పిల్లలు చివరకు మృతదేహాలుగా లభ్యం కావడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. జిల్లా కేంద్రమైన విజయపురలో ఆదివారం ముగ్గురు పిల్లలు కనిపించలేదు. ఇండి రోడ్డులోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీటి సంస్కరణ కేందంలో సోమవారం శవాలుగా లభించారు. గదగ్‌కు చెందిన అనుష్కా (9), విజయ (7), విజయపురకు చెందిన మిహిర్ జానగౌళి (7)లను మృతులుగా గుర్తించారు. వీరిలో వేసవి సెలవులలో అవ్వ ఇంటికి అనుష్కా, విజయలు వచ్చారు. ఆదివారం ఉదయం ఇంటిముందుకు వచ్చిన ఒంటెపై కొద్దిసేపు సవారీ చేశారు. అనంతరం ఒంటెలకోసం సమీపంలోని చాబు కసాబ్‌దర్గా వద్దకు వెళ్లారు. అక్కడనుంచి తిరిగి వారు రాలేదని తెలుస్తోంది. సాయంత్రం గడిచినా రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అయినా ఆచూకీ దొరకక పోవడంతో ఏపీఎంసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు , పోలీసులు పిల్లలకోసం వెదికారు. సోమవారం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నీటి సంస్కరణా కేంద్రంలో మృతదేహాలు లభించాయి. కాగా నీటి సంస్కరణా కేంద్రంలో తగిన రక్షణ చర్యలు లేకపోవడంతోనే పిల్లలు మృతి చెందారని తల్లిదండ్రులు నిరసన తెలిపారు. కాగా నగరంలోని మురుగునీటి సంస్కరణా కేంద్రం ప్రమాదకరంగా ఉన్నా మహానగర పాలికె ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. చుట్టూ తగిన ఫెన్సింగ్, అడ్డుగోడ లేదన్నారు. కనీసం కాపలాదారులను కూడా నియమించలేదన్నారు. రక్షణ చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



చిన్నారులను బలిగొన్న నీటి శుద్ధి కేంద్రం

ప్రజాకాంక్ష ఉన్నవారికే మద్దతివ్వండి : విజయేంద్ర



పట్టభద్రుల అభ్యర్థి దేవేగౌడ నామినేషన్‌లో విజయేంద్ర, ఆర్ అశోక్

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాకాంక్ష ఉన్నవారికే మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం అభ్యర్థులు వైఏ నారాయణస్వామి, అ దేవేగౌడల నామినేషన్‌లలో ఆయన పాల్గొన్నారు. ప్రతిపక్ష నేత అశోక్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, మాజీ డీసీఎంలు గోవింద కారజోళ, డాక్టర్ అశ్వత్థనారాయణతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జేడీఎస్ మద్దతు కొనసాగనుందన్నారు. వైఏ నారాయణస్వామి, అ దేవేగౌడలకు పరిషత్‌లో అపారమైన అనుభవం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై దశాబ్దాలకాలంగా వారు పోరాటం చేస్తున్నారన్నారు. అశోక్ మాట్లాడుతూ సీఎం సహా ఎవరు ప్రచారం చేసినా తమ అభ్యర్థుల గెలుపును అడ్డుకోలేరన్నారు. రాజ్యసభ సభ్యుడు లెహర్‌సింగ్, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యే సురేశ్‌గౌడ, లక్ష్మినారాయణ, ఎం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

17 నామినేషన్లు..

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం బెంగళూరు పట్టభద్రుల స్థానానికి 6, ఆగ్నేయ ఉపాధ్యాయ స్థానానికి 5 నామినేషన్లు, నైరుతి పట్టభద్రుల స్థానానికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈశాన్య పట్టభద్రుల స్థానానికి 1, నైరుతి పట్టభద్రుల స్థానానికి 1, దక్షిణ ఉపాధ్యాయ స్థానానికి 1 నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్ నుంచి 2, బీజేపీ నుంచి 3, జేడీఎస్ నుంచి 1 నామినేషన్ దాఖలు కాగా ఇప్పటివరకు మొత్తంగా 19 నామినేషన్లు దాఖలమయ్యాయి. ఇండిపెండెంట్‌లు, మహిళలు ఎవ్వరూ నామినేషన్ వేయలేదు.

స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..

- బీజేపీ టిక్కెట్ దక్కకపోవడంపై మాజీ ఎమ్మెల్యే రఘుపతి భట్ ఆగ్రహం

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉడుపికి చెందిన మాజీ ఎమ్మెల్యే కే రఘుపతిభట్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. నైరుతి పట్టభద్రుల నియోజకవర్గం పోటీ చేయదలిచినట్లు తెలిపారు. ఉడుపిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ టిక్కెట్ ఆశించానన్నారు. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు కూడా టిక్కెట్‌పై భరోసా ఇచ్చారన్నారు. ఆమేరకు ఓటర్ల నమోదుకు సంబంధించి చురుగ్గా పాల్గొన్నానని 20వేలమందికిపైగా నమోదు చేయించానన్నారు. ప్రస్తుతం ఒక్కసారిగా టిక్కెట్ నిరాకరించడంతో మనస్తాపానికి గురై స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నానన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఉడుపి నుంచి టికెట్ నిరాకరించినప్పటికీ పార్టీ విజయం కోసం పాటుపడ్డానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ విజయానికి కృషి చేశానన్నారు. అయితే ఆశించిన టిక్కెట్ దక్కలేదన్నారు. ప్రస్తుతం తాను బీజేపీకి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఓడినా గెలిచినా బీజేపీలోనే ఉంటానన్నారు. టిక్కెట్ ఇస్తానని హామీ ఇచ్చి తప్పడంతోనే బాధ కలిగి స్వతంత్రంగా పోటీ చేస్తున్నానన్నారు.





అందమే..అందం..

గుత్తులు..గుత్తులుగా ఆకట్టుకుంటున్న ఈ పుష్పాలు ఏటా మే నెలలో మాత్రమే పూస్తాయి. శిడ్లఘట్ట తాలూకాలోని బూదగూరు గ్రామానికి చెందిన సేంద్రియ రైతు వెంకటరామిరెడ్డి తోటలో వికసించిన ఈ పూలు స్థానికులను విశేసంగా ఆకట్టుకుంటున్నాయి. తొలకరి వర్షాలు కురిసిన తర్వాత ఈ పూలు వికసిస్తాయి. నెలాఖరు వరకు ఉంటాయి. మే నెలలలోనే పూయడంతో వీటిని అలా పిలుస్తారని రైతు తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వీటిని సాగు చేశానన్నారు. - శిడ్లఘట్ట

ప్రజ్వల్ నివాసంలో ఫోరెన్సిక్ బృందాల సోదాలు

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై అత్యాచార కేసులు నమోదైన మేరకు హాసన్‌లోని ఎంపీ అధికారిక నివాసంలో ఫోరెన్సిక్ బృందాలు సోమవారం సోదాలు జరిపాయి. హాసన్‌లోని ఆర్‌సీ రోడ్డులో ఎంపీ నివాసానికి వేసిన తాళాన్ని స్థానిక పోలీసుల సమక్షంలో ఎఫ్‌ఎస్‌ఎల్ బృందాలు తొలగించి సాక్షాలకోసం సోదాలు జరిపారు. ఇంటిచుట్టూ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చేసిన సిట్ బృందాలు బాధిత మహిళను పంచనామా చేశారు.



ప్రజ్వల్ నివాసం వద్ద పోలీసు బలగాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.64	1,576.80
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	41	1129
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	13	201
సామర్థ్యం (టీఎంసీలు)	3.43	2.83

హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ



మేనేజ్‌మెంట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

బళ్లారి సిటీ, మే 13: హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో భాగంగా 'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్' ఆధ్వర్యంలో తోరణగల్లు, హొస్పేట్, హంపిలోని వివిధ అంతర్జాతీయ తరగతి హోటళ్లలో సోమవారం విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. మొత్తం 33మంది విద్యార్థులకు తోరణగల్లు విద్యానగర్ హోటల్, హయత్ రాక్ రీజెన్సీ, హోసపేటలోని రాయల్ ఆర్కిడ్, హంపిలోని విజయశ్రీ హెరిటేజ్, దరోజీలోని ఎవాల్వ్ బ్యాక్ హోటళ్లలో శిక్షణ ఏర్పాట్లు చేశారు. హోటల్ హయత్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, శిక్షణ అధికారి నిగెల్ నాయుడు కంప్లి విద్యార్థులకు హోటల్ రూమ్ నిర్వహణ, హోటల్లో రోజువారీ కార్యకలాపాలు, కస్టమర్లతో స్నేహపూర్వక వ్యవహారం, క్రమశిక్షణ తదితర అంశాలపై వివరించారు. జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థకు చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మేనేజ్‌మెంట్ కోర్సు శిక్షకులు అనిల్ కనగిని, అనుపమ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి హోటళ్ల రోజువారీ కార్యకలాపాలపై ప్రాక్టికల్ శిక్షణ ఎంతో అవసరమన్నారు. ఈసందర్భంగా జిల్లావాణిజ్య ప్రరిశ్రమల శాఖ సీనియర్ ఉపాధ్యక్షుడు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యదర్శి యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, హోటల్ హయత్‌కు చెందిన మేఖేల్, రాయల్ ఆర్కిడ్‌కు చెందిన ఇబ్రహీం, ఎవాల్వ్ బ్యాక్‌కు చెందిన ఝూన్సి, విద్యాశ్రీ, రిసార్ట్‌కు చెందిన తనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వీరేశ్ కట్టెమ్యా కన్నుమూత



బళ్లారి సిటీ, మే 13: బళ్లారి జిల్లా ఆసుపత్రిలో జర్నలిస్ట్ వీరేశ్ కట్టెమ్యా(42)ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన చాలకాలం బళ్లారి విజయ కర్ణాటక కార్యాలయంలో ఉప సంపాదకులుగా సేవలు అందించారు. సిరుగుప్పతాలూకా రాంపుర గ్రామంలో ఆయన అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం జరిగాయి. ఆయన మృతి పట్ల బళ్లారి జిల్లా విలేకరులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో ఉపాధి కల్పిస్తున్న పనులు



ఉపాధి పనులు చేస్తున్న గ్రామస్థులు

కంప్లి, మే13: గ్రామాల్లోని ప్రజల జీవనానికి ఉపాధి పనులు ఆధారంగా నిలిచాయి. గ్రామాల్లో పనులు లేక ప్రజలు ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించడంతో ప్రజలు కూలీలకు వెళుతూ వారి జీవనానికి మార్గం కల్పించుకుంటున్నారు.. ఈసందర్భంగా ఈవో శ్రీకుమార్ మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఈఏడాది గ్రామాల్లోని కూలీలు పనులు చేయడానికి తరలి వస్తున్నారన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మడకశిరటౌన్, మే 13: నగర పంచాయతీ పరిధిలోని చీపులేటి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి(58) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం పొలంలోకి పశువులను మేపడానికి వెళుతున్న సందర్భంలో ఉన్నఫళంగా 11కేవీ విద్యుత్ వైర్ నరసింహారెడ్డిపై తెగిపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా గేదె కూడా మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

విజయనగర జిల్లాలో భారీ వర్షం

● ఎగిరిపడిన ఇళ్ల పైకప్పులు ● నేలకూలిన చెట్లు

బళ్లారి సిటీ, మే 13: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలోని గుడేకోటే ప్రాంతంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి కొన్ని ఇళ్ల పైకప్పు రేకులు ఊడిపోవడంతో పాటు పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం జరగలేదు. గుడేకోటలో 27.3మిల్లీమీటర్లు, కూడ్లిగి తాలూకా చిక్కజోగిహళ్ళిలో 18.2 మిల్లీమీటర్లు, కూడ్లిగి పట్టణంలో 22.4మి.మీ వర్షం కురిసింది. సంకలాపురం గ్రామానికి చెందిన గుండమ్మ, యర్రలింగనహళ్ళి గ్రామానికి చెందిన హనుమంతప్ప ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఏకాంతప్ప, మల్లమ్మ, చిన్న ఓబయ్య తోటలోని తీగలు తెగిపోయి నష్టపోయారు. రెవెన్యూ శాఖ వర్గాలు ఘటనా స్థలానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం కోసం నివేదిక పంపారు.



ధ్వంసమైన ఏకాంతప్ప, మల్లమ్మ తోట



మురికి కుంటలా మారిన కుడితిని తిమ్మలాపురం రోడ్డు

చినుకు పడితే చిత్తడే!

● మురికి గుంతలుగా మారినరోడ్లు

కంప్లి, మే 13: చిరు జల్లులు కురిస్తే చాలు కుడితిని నుండి తిమ్మలాపురం రోడ్డు అంతా మురికికుంటలా మారిపోతుంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై ఏర్పడిన లోతైన గుంతలలో నీరు నిండి రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది కరంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఈదారిలో ప్రయాణించే వాహనాలు కూడా ప్రమాదవశాత్తు నీటిగుంతలను తప్పించ బోయి బోల్తా పడ్డాయి. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని బీమన్న, హనుమంతప్ప నాగరాజు తదితరులు కోరుతున్నారు.

ప్రజలకు ఊరట.. రైతులకు శాపం..!

● అకాల వర్షంతో తడిసిముద్దయిన ధాన్యం

రాయచూరు, మే 13 : గత నెల రోజుల కాలంగా ఎండ వేడితో తల్లడిల్లిన ప్రజలకు వర్షం రాక ఊరటనివ్వగా రైతులకు శాపంగా మారింది. ఆదివారం అర్ధ రాత్రి భారీగా కురిసిన వర్షంతో నగరంలోని ఏపీఎంసి మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యమంతా తడిసిముద్దైంది. జిల్లా రైతులతో పాటు తెలంగాణలోని మక్తల్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకోరాగా అకాలంగా కురిసిన వర్షంతో మొత్తం ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. వర్షం వల్ల చల్లటి వాతావరణంతో ప్రజలు ఊరట చెంది సంతోషం పడుతుండగా రైతులు మాత్రం వర్షం రాక తమకు శాపంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడసిన దాన్యం అమ్ముడుపోతుందో లేదో అన్న ఆందోళనలో రైతులు కొనుగోలుదారులవైపు దీనంగా చూసే పరిస్థితి తలెత్తింది.







ఏపీఎంసీ మార్కెట్‌లో తడిసి ముద్దయిన ధాన్యం

శ్రీశైలేశ్వర విద్యాకేంద్రంలో మాతృదినోత్సవం

బళ్లారి సిటీ, మే 13: జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అన్న సూక్తి ప్రకారం భారతీయ సంస్కృతిలో మాతృదినోత్సవానికి విశేష ప్రాధాన్యం ఉందని సంస్థ సెక్రటరీ చిదంబర నానావతే అన్నారు. సోమవారం విద్యాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లులందరూ తమ పిల్లలకు పుట్టినప్పటి నుంచి సంస్కారాలు నేర్పించాలన్నారు. ఇల్లు మొదటి పాఠశాల అని మొదటి గురువు తల్లి అని తెలిపారు. శ్రీశైలేశ్వర విద్యా కేంద్రం గౌరవాధ్యక్షులు శ్రీమతి లక్ష్మీబాయి నానావతే మాట్లాడుతూ దేశ నిర్మాణంలో తల్లుల ప్రాముఖ్యత గురించి విపులంగా మాట్లాడారు. కుమార్ నానావతే మాట్లాడుతూ యశోద కృష్ణుడిని,జీజాబాయి చత్రపతి శివాజీని పెంచిన విషయాన్ని హిందూస్థాన్ ఎప్పటికీ మరువదన్నారు. భారతరత్నను నిర్మించే శక్తి తల్లులందరికి ఉందన్నారు. సభా కార్యక్రమం అనంతరం అమ్మవారికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన గురువు మాత శ్రీమతి సుజాత ఘోర్పడే, శ్రీమతి రుక్మిణీ బాయి తదితరులు పాల్గొన్నారు.



మాతృదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాతృమూర్తులు

జిందాల్‌లో ముగ్గురు మృతి ఘటనలో

కంపెనీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులపై కేసు

బళ్లారి, మే 13(ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీలో మే 9 న జరిగిన ప్రమాదానికి కారకులని భావిస్తూ జిందాల్ కంపెనీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులపై విజయనగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ ప్రమాదంలో విజయనగర జిల్లా భువనహళ్లికి చెందిన జడియప్ప, బెంగళూరుకు చెందిన సుశాంత్, చెన్నైకి చెందిన మహాదేవన్ అనే ముగ్గురు ఇంజనీయర్లు మృత్యువు పాలైన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై విజయనగరకు చెందిన జడియప్ప సోదరుడు మహేంద్ర తోరణగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ప్రమాదానికి అక్కడ పనిచేసే యూనిట్ హెచ్‌వోడీలను బాధ్యుల్ని చేసి కంపెనీ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని అలా కాకుండా ప్రధానంగా కంపెనీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులపై కేసు నమోదు చేయాలని ఆయన ఫిర్యాదులో కోరారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తోరణగల్లు పోలీసులు తెలిపారు.

17న రాయచూరులో ఉద్యోగ మేళా



విలేకరులతో మాట్లాడుతున్న అనంతనాగ్

రాయచూరు, మే 13 : నగరంలోని రూట్స్ ఎంఎస్‌డబ్ల్యూ కళాశాలలో ఈ నెల 17వ తేదీన ఉద్యోగ మేళా ఏర్పాటు చేశామని సంభవ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అనంతనాగ్ తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. సంభవ ఫౌండేషన్ ఆస్పైర్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసే ఉద్యోగ మేళాలో పీయూసీ, డిప్లొమ, బీటెక్ కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మేళాలో ఎంపికైన వారికి నెలరోజుల పాటు ఎంపిక చేసిన ఉద్యోగానికి సంబంధించి ఉచిత వసతి భోజన సౌకర్యంతో కూడిన శిక్షణ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతి-యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండేళ్లు పూర్తయినా ఆగని ఎయిమ్స్ పోరాటం



నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన ఎయిమ్స్ పోరాట కమిటీ నాయకులు

రాయచూరు, మే 13 : రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష పోరాటానికి సోమవారంతో రెండేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా మూడవ సంవత్సరం ప్రారంభదినమైన సోమవారం ఉద్యమ నాయకులు ఒకరోజు సత్యగ్రహం చేపట్టారు. దీక్ష శిబిరంలో పాల్గొన్న స్వాతంత్ర్య పోరాట సమరయోధుడు దివంగత పంపణ్ణ మద్దతుదారులు ఎయిమ్స్ పోరాటానికి తమ సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు నాయకులు కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి గతంలో ప్రకటించిన మేరకు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేయాలన్నారు. ఎయిమ్స్ సంస్థ ఏర్పాటు జిల్లా ప్రజలకు అత్యంత అవసరమైన అంశమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి ఇదే రీతిలో కొనసాగిస్తే పోరాటాన్ని ఉధృత రూపంలోకి మార్చుతామని హెచ్చరించారు.

సంగీత పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

హోసూరు (కృష్ణగిరి), మే 13: తమిళనాడు ప్రభుత్వం కళలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కృష్ణగిరి జిల్లా ప్రభుత్వ సంగీత పాఠశాలలో ఆసక్తిగల 13 - 25 సంవత్సరాల మధ్య యువతీ యువకులకు అడ్మిషన్లు ప్రారంభించారు. ఇక్కడ గాత్ర సంగీతం వంటి సాంప్రదాయ కళలు ఉన్నాయి. నటాసురం, భరతనాట్యం, వయోలిన్, తబల, మృదంగం వంటి కళల్లో కూడా శిక్షణ ఇస్తారు. పాఠశాల ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తుంది. శిక్షణ కాలం 3 సంవత్సరాలుగా ఉంటుంది. శిక్షణ ముగింపులో తమిళనాడు పరీక్షా విభాగం పరీక్షను నిర్వహిస్తోంది. ఉత్తీర్ణత ధృవీకరణ పత్రాన్ని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ జారీ చేస్తారు, శిక్షణ రుసుము లేదు. ప్రత్యేక రుసుముగా సంవత్సరానికి రూ.350 మాత్రమే నిర్ణయించారు. విద్యార్థులందరికి నెలకు రూ.400 విద్యా సహాయం అందిస్తారు. పాఠశాలలో చేరాలనుకునే వారు వెంటనే ప్రిన్సిపాల్, జిల్లా ప్రభుత్వ సంగీత పాఠశాల, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా తిరుమల నగర్, రామాపురం, కృష్ణగిరి చిరునామాలో 04343 - 234001, 9443785837 నెంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు ప్రకటనలో తెలిపారు.

వాహన చోరీకి యత్నం

హోసూరు(క్రైం), మే 13: హోసూరు సమీపంలోని ఓ ఇంటి ముందు ఆపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని దుండగులు చోరీకి యత్నించిన దృశ్యం సీసీటీవీ ఫుటేజీలో రికార్డు అయింది. హోసూరు సమీపంలో బత్తలపల్లి ప్రాంతంలో ఉంటూ ఉద్దనపల్లిలో మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్న వెంకటేశ్, ఎప్పటిలాగే తన రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం వాహనాన్ని చూడగా వాహనం సైడ్ లాక్ పగలగొట్టి వాహనం తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. ఈమేరకు బాధితుడు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హోసూరు జోన్

నురుగు నీటితో పంటలకు నష్టం



నురుగునీటితో నిండిన కెలవరపల్లి డ్యాం

హోసూరు, మే 13: హోసూరు సమీపంలోని కెలవరపల్లి రిజర్వాయర్ నుంచి 570 క్యూసెక్కుల నీరు విడుదల కావడంతో సుమారు 50 అడుగుల ఎత్తున నురుగులతో కూడి నీరు వెలువడుతోంది. ఇలా రసాయన వ్యర్థాలతో కూడిన నురుగు నీరు పంటలకు మళ్లిస్తే నష్టం వాటిల్లుతోందని పలువురు రైతులు వాపోయారు. క్యాబేజీ తోట మొత్తంనురుగు ఆక్రమించి రైతులను వేదనకు గురిచేసింది. పొరుగున కర్ణాటక రాష్ట్రంతో పాటు డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో అడపాదడపా వర్షం కురుస్తున్న కారణంగా హోసూరు కెలవరపల్లి రిజర్వాయర్ డ్యాంలో నీటి ఇన్‌ఫ్లో పెరిగింది. కెలవరపల్లి రిజర్వాయర్ ఆనకట్ట తూములకు మరమ్మతులు చేస్తుండడంతో ఆనకట్టకు చేరే నీటిని నేరుగా దక్షిణ పినాకిని నదిలోకి వదులుతున్నారు. డ్యాంకు ఆదివారం 474 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సోమవారం 205 క్యూసెక్కులుగా నమోదైంది. కొన్ని నెలల తర్వాత నది ఉధృతంగా ప్రవహించడం రైతులకు ఊరటనిచ్చినా, కెలవరపల్లి డ్యామ్‌కు వస్తున్న నీరు విపరీతంగా రసాయన వ్యర్థాలు కలిసి నురుగుతో కుప్పలుగా వస్తోంది. 50 అడుగుల ఎత్తైన కొబ్బరి చెట్లను కూడా నురుగు కప్పేయడంతో లక్షలకొద్ది రైతులకు నష్టం వాటిల్లుతోంది.

సమగ్ర వ్యవసాయ అభివృద్ధి పథకానికి

ఐదు పంచాయతీల ఎంపిక

హోసూరు, మే 13: హోసూరు జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను కరుణానిధి అన్ని గ్రామాల సమగ్ర వ్యవసాయ అభివృద్ధి పథకం క్రింద పలవనల్లి, బిక్కేపల్లి, కెలవరపల్లి, తుమ్మనపల్లి, కొత్తకొండపల్లి పంచాయతీలను ఎంపికచేశారు. ప్రతి పంచాయతీకి 100 ఎకరాల చొప్పున సహాయ వ్యవసాయ అధికారులు మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. భూసార పరీక్షలు చేసి రసాయనిక ఎరువులు అధికంగా వాడకుండా నిరోధించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా రైతులకు తగిన సలహా సూచనలు చేస్తున్నారు. సాధారణంగా పంట కోత, నీటి ప్రవాహం, పోషకాల ఆవిరి కారణంగా నేలసారం క్షీణిస్తుంది. పొలాన్ని బట్టి పోషకాల పరిమాణం మారుతూ ఉంటుంది. పంటను బట్టి పంటకు పోషకాల అవసరం మారుతూ ఉంటుంది. భూసార పరీక్షల ద్వారా, పంటకు అనుగుణంగా సరైన ఎరువులు సిఫారసు చేస్తారు. తద్వారా తక్కువ ఖర్చుతో అదనపు దిగుబడిని పొందేలా ఎలాంటి విధానాలు పాటించాలో అధికారులు రైతులకు వివరించి, పొలంలో మెట్ట ప్రాంతాలకు, లోతట్టు ప్రాంతాలకు ప్రత్యేకంగా మట్టి నమూనాలను తీశారు. భూసారానికి అనుగుణంగా వరి, రాగులు, వేరుశెనగ, చెరుకు, మిరప, మామిడి వంటి పంటలను పండించేందుకు సిఫారసు చేస్తున్నారు.



భూసారాన్ని పరీక్షిస్తున్న అధికారులు

టెన్త్ సీబీఎస్ఈలో నారాయణ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కార్తిక్ నిధిబసవరాజు ఆర్డిక్ నానపూర్ ఐసిరి శిశిర్

బళ్లారి సిటీ, మే 13: కేంద్రీయ హైస్కూల్ శిక్షణ పరీక్షా మండలి నిర్వహించిన సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాలను సోమవారం విడుదల చేశారు. బళ్లారి నారాయణ పాఠశాల విద్యార్థులు శిశిర్ రాజీవ్ హేమాద్రి 500 మార్కులకు గాను 493 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. పరీక్షకు హాజరైన 82 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను బళ్లారి నారాయణ శాఖ కోర్ డీన్ సురేంద్ర నాథ్‌రెడ్డి, ఏజీఎం లవణకుమార్, ప్రాచార్యులు రజని, సిబ్బంది అభినందించారు.

బాల్య వివాహాల నియంత్రణపై సమీక్ష

హోసూరు(కృష్ణగిరి), మే 13: బాల్య వివాహాల నియంత్రణ, పిల్లలపై లైంగిక వేధింపులను నియంత్రించేందుకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కె.ఎం.సరయు నేతృత్వం వహించగా ఎస్పీ తంగదురై అధ్యక్షత వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై వెంటనే పోక్సో కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. బాధిత చిన్నారులకు ప్రభుత్వం నుంచి తగిన సాయం అందేలా చూడాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణిని ఆదేశించారు. బాల్యవివాహాలపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కేఎం సరయు, పాల్గొన్న అధికారులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

మృణాల్ సేన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత మృణాళ్ సేన్ 1923 మే 14న అవిభాజ్య భారతదేశంలో, ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఫరీద్‌పూర్‌లో జన్మించారు. భారతీయ సినీ దర్శకుడు. సమకాలీకులైన సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్‌లతో కలసి సినీ రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. దర్శకుడిగా తొలి చిత్రం 'రాత్ భోరే' 1955లో రూపొందించారు. సినిమా ద్వారా సామాజిక వాస్తవాన్ని వ్యాఖ్యానించడం, కళాత్మకంగా ప్రతిబింబించడం వంటివాటికి ఆయన పేరొందారు. 1983, 1997లలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. 2017లో ఆస్కార్ అకాడమీ సభ్యుడిగా వ్యవహరించారు. 18 నేషనల్ ఫిల్మ్ అవార్డులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు. 2018 డిసెంబరు 30న కన్నుమూశారు.

మార్క్ జుకెర్‌బర్గ్ (పుట్టినరోజు)



సోషల్ మీడియా దిగ్గజమైన 'ఫేస్‌బుక్' (మెటా ప్లాట్‌ఫాం) సృష్టికర్తగా సుపరిచితులైన మార్క్ ఎలియట్ జుకెర్‌బర్గ్ 1984 మే 14న న్యూయార్క్‌లో జన్మించారు. కంప్యూటర్ ప్రోగ్రామర్, ప్రస్తుతం ఫేస్‌బుక్‌కు సీఈగా వ్యవహరిస్తూ ప్రపంచవ్యాప్తంగా టాప్ 100 ప్రభావితులలో ఒకరిగా పేరొందారు. కొవిడ్ క్లిష్టంలో 25 మిలియన్ డాలర్లను బిల్‌గేట్స్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇచ్చారు. ధనవంతుడైనా దాతృత్వంలో మిన్న అనిపించుకుని శెహబాష్ అనిపించుకున్నారు.

మానుషి చిల్లర్ (పుట్టినరోజు)



'మిస్ వరల్డ్' 2017 విజేత మానుషి చిల్లర్ 1997 మే 14న హరియాణ రాష్ట్రంరొహటక్‌లో జన్మించారు. దేశం తరఫున 'ప్రపంచ సుందరి' కిరీటం పొందిన ఆరవ యువతి. రాజా, రాధారెడ్డిల నేతృత్వంలో కూచిపూడి నృత్యంలో తర్ఫీదు పొందారు. 'ప్రాజెక్ట్ శక్తి'లో భాగంగా మహిళల నెలసరి సమస్యలపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సీఎన్ఎన్-ఐబీఎన్‌చే ఇండియన్ ఆఫ్ ది ఇయర్ 2017 పురస్కారం అందుకున్నారు. ప్రముఖ సంస్థల ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు. యునిసెఫ్ నిర్వహించే చైతన్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

రోడ్డు విస్తరణ కోసం దుకాణాల తొలగింపు

- పురసభ సిబ్బంది దూకుడు - దుకాణదారులు, పోలీసుల మధ్య వాగ్వాదం
- 50కి పైగా చెట్ల తొలగింపుపై స్థానికులు నిరసన

విజయపుర, మే 13: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో రోడ్డు విస్తరణకోసం ఆక్రమించిన దుకాణాలు, ఇతర కట్టడాలు తొలగించారు. సోమవారం పోలీసు బందోబస్తు నడుమ పురసభ సిబ్బంది కార్యాచరణ నిర్వహించారు. పట్టణంలోని శివగణేశ సర్కిల్ నుంచి కోలారు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కోలారు రోడ్డు విస్తరణ కొన్ని రోజుల క్రితమే ప్రారంభించినా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. దుకాణాలు, ఇతరత్రా తొలగింపువేళ కొందరితో వాగ్వాదం జరిగింది. పోలీసు అధికారులు కట్టుదిట్టంగా చర్యలు చేపట్టడంతో విస్తరణ చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన మార్కింగ్ పనులను కొనసాగించారు. స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు చిల్లర దుకాణదారులు, పండ్ల దుకాణాల నిర్వాహకులు కోరినా గడువు ఇవ్వకనే కార్యాచరణ చేపట్టారు. దీంతో కోలారు రోడ్డుపై వ్యాపారం చేసే వీధి వ్యాపారులు కన్నీరుపెట్టారు. దుకాణాల తొలగించేందుకు కనీసం గడువు, నోటీసు ఇవ్వకనే తొలగించడం సరికాదని వాగ్వాదం చేశారు. కాగా రోడ్డు విస్తరణ కోసం వందలాది సంవత్సరాల క్రితం నాటిన 50కుపైగా భారీ వృక్షాలు తొలగించాలన్న నిర్ణయాన్ని పర్యావరణ ప్రేమికులు వ్యతిరేకించారు.



రోడ్డు విస్తరణ కార్యాచరణ ఇలా..

దళితులపై దౌర్జన్యాలను నియంత్రించండి



తాలూకా కార్యాలయం వద్ద నిరసన

బాగేపల్లి, మే 13: దళితులపై దౌర్జన్యాలు రోజురోజుకు అధికమవుతున్నాయని, అదే విధంగా ఆర్థికంగా దివాళా తీసే విధానాలను ప్రభుత్వాలు మార్చుకోవాలని దళిత సంఘాలు హెచ్చరించాయి. పట్టణంలో దళిత హక్కుల సమితి నేతృత్వంలో సోమవారం నిరసన తెలిపారు. దళిత హక్కుల రాష్ట్ర సంచాలకులు బిళ్ళూరు నాగరాజ్ మాట్లాడుతూ పలు డిమాండ్లను కోరుతూ తాలూకా కార్యాలయం వద్ద నిరసన చేపట్టినటు తెలిపారు. దళితుల అభివృద్ధికి బడ్జెట్‌లో కోట్లాది రూపాయల గ్రాంటు ప్రకటించారని అయితే ఆమేరకు నిధులు దళితులు అందడం లేదన్నారు. సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ ఎస్టీ బోర్డులు సౌలభ్యాలను లబ్ధిదారులకు అందించాలన్నారు. నరేగా పథకం కింద 200 రోజుల పని కల్పించాలని, కూలి మొత్తాన్ని రూ.600కు పెంచాలన్నారు. అన్ని దళిత కుటుంబాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం చీటీలు ఇవ్వాలన్నారు. పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలన్నారు. ఇలా పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. నిరసనలో దళిత హక్కుల సమితి జిల్లాసంచాలకులు చుంచరాయనపల్లి కృష్ణప్ప మాట్లాడుతూ దళితులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. దళితులపై దౌర్జన్యాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. నిరసనలో జీ కృష్ణప్ప, జిల్లాసంచాలకులు కే మునియప్ప, సీఐటీయూ తాలూకా కార్యదర్శి ముస్తాఫా, సీపీఎం ప్రముఖులు చన్నరాయప్ప, కొలింపల్లి చలపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకే ప్రాధాన్యం

బంగారపేట, మే 13: తాలూకాలో శాంతిభద్రతలు కాపాడడమే ప్రాధాన్యత అని అలాగే ఎస్సీ ఎస్టీ వర్గాల పరిరక్షణకు బాధ్యతగా ఉందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ నంజప్ప తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమావేశంలో దళితవాడలలో సభలు నిర్వహించడం, పేకాట అడ్డాలను, అక్రమ మద్యం విక్రయాలను నియంత్రించాలనే అంశాలపై వినతులు వచ్చాయని ఆమేరకు పోలీసుశాఖ అన్ని చర్యలు చేపట్టిందన్నారు. గత పదేళ్లలో ఎటువంటి నేరాలు చేయని వారిలో 123మంది రౌడీషీటర్లను ఈ సంవత్సరం జాబితానుంచి తొలగించామన్నారు. వీరిలో ఆరుగురు మృతి చెందగా చాలా కేసులలో పరస్పర రాజీతో పరిష్కారమయ్యాయన్నారు. మహిళల రక్షణకు కట్టుబడి జనస్నేహిగా పోలీసుశాఖ పని చేస్తోందన్నారు. చట్టాలపై అవగాహన కల్పించేలా పాఠశాల, కళాశాలల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాగా భూముల వ్యవహారాలకు సంబంధించి రెవెన్యూశాఖ అధికారుల వైఫల్యంపై ఫిర్యాదులు వచ్చాయని ఈమేరకు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆరు నెలల కన్నబిడ్డను భర్త మునిరాజు కిడ్నాప్ చేసి అమ్మేశాడని భార్య వల్లీ ఫిర్యాదు చేసింది. కాగా దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు హుణసనహళ్ళి వెంకటేశ్ మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్ సురేశ్ బాధ్యతలు స్వీకరించాక కేసులను త్వరగా పరి ష్కరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమావేశంలో దళిత నాయకులు సి.జె.నాగరాజు, చిక్కనారాయణ, రామణ్ణ, రమణకుమార్, కళాకారుడు ఎల్లప్ప, సాకప్ప, రఘు, కెరెకోడి మంజుళ, హుణసనహళ్ళి సతీశ్, సుభాష్, లక్ష్మమ్మ, లలితా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ నంజప్ప

వైద్యసేవలు సరళీకృతం కావాలి

- శివరాత్రి దేశికేంద్రస్వామిజీ

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): వైద్యసేవలు అన్నివర్గాల ప్రజలకు సరళీకృతం కావాలని జగద్గురు శివరాత్రి దేశికేంద్రస్వామిజీ అభిప్రాయపడ్డారు. యలహంకలో 250 కోట్ల రూపాయలతో 251 పడకల సామర్థ్యంతో స్పర్శ్ ఆసుపత్రిని ఆదివారం రాత్రి లాంఛనంగా ప్రారంభించారు. స్పర్శ్ ఫౌండర్ డాక్టర్ శరణ్ శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రముఖులు హాజరయ్యారు. ఆసుపత్రిని డీసీఎం డీకే శివకుమార్ ప్రారంభించగా పలు విభాగాలను మంత్రులు ఎంబీ పాటిల్, ఎస్ఎస్ మల్లికార్జున, శరణ బసప్ప దర్శనాపుర, జగదీశ్‌శెటటశెట్టర్‌లు నిర్వహించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్, కాంగ్రెస్ సీనియర్ నేత శామనూరు శివశంకరప్ప పాల్గొన్నారు. ఫౌండర్ శరణ్ శివరాజ్ పాటిల్ 7వ శాఖను యలహకంలో ప్రారంభించామని, ఒకే చోటునే అన్ని విభాగాల వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. యలహంకతోపాటు బెంగళూరు ఉత్తర ప్రాంతాలలో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యమన్నారు.



శివరాత్రి దేశికేంద్రస్వామిజీ, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో అభయాంజనేయస్వామి

చింతామణి, మే 13: తాలూకాలోని చిలకలనేర్పు హోబళి లో గంగమ్మ క్షేత్రంగా పేరొందిన బురుడగుంటె గ్రామంలో శ్యానుభోగ కుటుంబం ఆధ్వర్యంలో అభయ ఆంజనేయస్వామి ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. వందలాదిమంది భక్తులు పూలహారాలు సమర్పించారు. బురుడగుంటె గ్రామానికి చెందిన భజనమండలి సంఘాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సామూహిక భజన నిర్వహించారు. శ్యానుభోగ కుటుంబానికి చెందిన కేఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో చక్కటి వర్షాలు కురవాలని, పంటలు పండాలని, రైతాంగంగా బాగుండాలని, ప్రజల శ్రేయస్సు కోరుతూ అభయ ఆంజనేయస్వామి నూతన విగ్రహం ప్రతిష్ఠాపన నిర్వహించామన్నారు. ధార్మిక కార్యక్రమాల్లో శ్యానుభోగ కుటుంబానికి చెందిన కేవీ మంజునాథ్, కేపీ వెంకటేశ్, కేఎల్ శ్రీనివాస్, కేఎల్ మణికంఠ, కేఎం అభిషేక్, గ్రామ ప్రముఖులు భరత్, అనుప్పల్లి కృష్ణారెడ్డి, ఉలిబెలె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు - మంగళూరు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం

- కూలిన చెట్లు - చక్కదిద్దిన అధికారులు

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు - మం గళూరుల మధ్య భారీ వర్షాల కారణంగా ఆదివారం రాత్రి పెద్ద వృక్షం కూలిపోవడంతో రోడ్డు బంద్ చేశారు. బెంగళూరు - మంగళూరుల మధ్య 75వ నెంబరు జాతీయ రహదారి శిరాడిఘాట్ మార్గంలో ఘటన చోటు చేసుకుంది. వాహన సంచారానికి సాధ్యం కాదని హైవే అథారిటీ తేల్చి చెప్పింది. దీంతో ఆదివారం రాత్రి నుంచి రాకపోకలు నిలిపివేశారు. దీంతో వందలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అటవీశాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా కార్యాచరణ నిర్వహించి సోమవారం ఉదయానికి పరిస్థితిని చక్కదిద్దారు.

ఐపీఓలోకి గో డిజిట్ ఇన్సూరెన్స్

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెం దిన జీవిత బీమా సంస్థ గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ ఐపీఓలోకి ప్రవేశించింది. సంస్థ సీనియర్ కామేశ్ గోయెల్ నగరంలో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 15న షేర్లు ఓపెన్ అయి ఈనెల 17న ముగియనుంది. మోటార్ ఇన్సూరెన్స్‌లో తమ సంస్థ జాతీయస్థాయిలో 6శాతంగా ఉందన్నారు. ప్రతి ఈక్విటీ షేరు వెల రూ.258 నుంచి రూ.272గా ఉందన్నారు. ఆసక్తిగలవారు కనీసం 55 ఈక్విటీ షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు.

ఎన్నికల కూలి గిట్టింది..!

అనంతపురం సెంట్రల్, మే 13: సార్వత్రిక ఎన్నికల ప్రచారంతో కూలీలకు కూలి గిట్టింది. రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు దాదాపు నెలరోజులు పనిదొరికింది. అభ్యర్థులే మూడు పూటలా భోజన, రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి ఉదయం ఒక పార్టీ, సాయంత్రం మరొక పార్టీ.. ఇలా అన్ని పార్టీలు ప్రచార పని కల్పించాయని, దీంతో కొంత సొమ్మును వెనుకేసుకోగలిగామని ప్రచారంలో పాల్గొన్నవారు చర్చించుకుంటున్నారు. ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అభ్యర్థుల వద్దతీసుకుని రూ.500 వరకు ప్రచార కూలీలకు చెల్లించారు. 20 మందిని సమకూర్చితే రూ.10వేల వరకు గిట్టుబాటు చేసుకున్నారు. సెగల కక్కే ఎండల్లో చమటకార్చుతూ ప్రచారం చేస్తే మధ్యవర్తులు లాభపడ్డారని కూలీలు పేర్కొంటున్నారు.

ఓటు జాతర..!

- అనంతలో పోటెత్తిన పోలింగ్ కేంద్రాలు
- కొత్త ఓటరులో ఉత్సాహం ఉరకలు
- బారులు తీరిన మహిళలు
- వైసీపీ కుట్రలు పటాపంచలు
- 75.63 శాతానికి పైగా పోలింగ్
- రాప్తాడులో అత్యధికంగా 81.41శాతం
- అనంత అర్బన్‌లో అత్యల్పంగా 64.05 శాతం



ఓటరు కార్డు చూపుతున్న ఓటర్లు

అనంతపురం/టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. వ్యవస్థలను రక్షించుకునేందుకు, హక్కులను కాపాడుకునేందుకు ఓటరు వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఓటరు చైతన్యానికి అద్దం పట్టింది. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా జన జాతర కనిపించింది. యువ ఓటర్లు మరింత ఉత్సాంగా కనిపించారు. మహిళలు బారులుతీరారు. పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటలకే అయినా.. అప్పటి వరకూ క్యూలో ఉన్నవారు ఓటేసేందుకు రాత్రి 10 గంటలు అయ్యింది.

వైసీపీ కుట్రలు పన్నినా..

పోలింగ్ సందర్భంగా అధికార వైసీపీ అలజడులు సృష్టించింది. ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోకుండా భయభ్రాంతులకు గురిచేయాలని చూసింది. ఇలా జరుగుతుందని వారం ముందే ప్రచారం జరిగింది. వైసీపీ కుట్రలు పన్నుతోందని టీడీపీ కూటమి, ఇతర పక్షాలు ఆరోపించాయి. అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీన్ని నిజం చేస్తూ.. తాడిపత్రి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయన తనయులు, అనుచరవర్గం వీరంగం సృష్టించారు. ప్రశాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినా, దాడులను నిలువరించలేకపోయారు. దెబ్బకు ఓటర్లు భయభ్రాంతులకు గురవుతారని వైసీపీ భావించినా... ఓటరు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. రాప్తాడు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా.. ఓటర్లు మాత్రం ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు కయ్యానికి కాలు దువ్వినా.. కూటమి నేతలు, కార్యకర్తలు ఎక్కడా సహనం కోల్పోలేదు. పోలింగ్ పైనే దృష్టి సారించారు. ఈ ఎన్నికల్లో ఇది విశేషం.

పోలింగ్ సరళి ఇలా..

అనంతపురం ఎంపీ, రాప్తాడు, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. ఉదయం 6.45 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉన్నా.. ఈవీఎంలు మొరాయించడంతో చాలాచోట్ల అర గంట నుంచి గంట దాకా ఆలస్యమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉదయం 9 గంటలకు 9.17 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలో అమాంతం పెరిగి.. 11 గంటలకు 23.03 శాతానికి చేరింది. మధ్యాహ్నం ఒంటి గంటకు 38.35 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తరువాత మందకొడిగా సాగి.. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి ఊపందుకుంది. సాయంత్రం 5 గంటలకు 63.27 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 10 గంటల దాకా కొనసాగింది. అధికారిక వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు రాత్రి 8 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 75.63 శాతం పోలింగ్ నమోదైంది.

యంత్రాల్లో భవితవ్యం

పోలింగ్ సోమవారం రాత్రి 10 గంటలకు ముగిసింది. ఓటర్ల తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగేదాకా అభ్యర్థుల భవితవ్యం అందులోనే ఉంటుంది. ఈవీఎంలను పటిష్ట పోలీసు భద్రత నడుమ జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు.

రాప్తాడు అత్యధికం

జిల్లా మొత్తం 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి 8 గంటల వరకు జరిగిన పోలింగ్ శాతాన్ని ఆయన విడుదల చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో అత్యధికంగా 81.41శాతం పోలింగ్ నమోదైంది. శింగనమలలో 80.13 శాతం, ఉరవకొండలో 80.04 శాతం నమోదైంది. అత్యల్పంగా అనంతపురం అర్బన్‌లో 64.05 శాతం పోలింగ్ నమోదైంది.



పోటెత్తిన ఓటర్లు



ఓటు కోసం స్వదేశానికి..

గుంతకల్లుటౌన్, మే13: విదేశాల నుంచి వచ్చిన పలువురు ఎన్ఆర్ఐలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల కార్యక్రమం సజావుగా జరిగింది. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం చినుకులు పడటంతో పోలింగ్‌కు ఓటర్లు క్యూకట్టారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం ఓటు వేశాం: రాయల్ శివ ప్రసాద్, కార్తీక దంపతులు, డల్లాస్ , యూఎస్.

మాకు డల్లాస్ రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. ఓటు వేసేందుకు అక్కడి నుంచి అమీన్‌పల్లి గ్రామానికి వచ్చాము. 30 సంవత్సరాల తరువాత ఓటు హక్కు వినియోగించుకున్నాము. మన రాష్ట్రానికి రాజధాని లేదు, నిరుద్యోగాలకు ఉద్యోగ అవకాశాలు లేవు. రాష్ట్ర అభివృద్ధి కోసం, రాష్ట్రానికి మంచి పరిపాలన అందించే నాయకుడు కావాలి. అందుకోసం తాము ప్రత్యేకంగా ఒక్కరోజు ముందు 5 వేల డాలర్లు చెల్లించి టికెట్ బుక్‌చేసుకుని గ్రామానికి వచ్చి ఓటు వేశాం.

రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష: మల్లికార్జున, సౌజన్య దంపతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సింగపూర్

సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఓటు వేసేందుకు సింగపూర్ నుంచి మా స్వగ్రామం అమీన్‌పల్లికి వచ్చాం. రాష్ట్రానికి మంచి పాలన అందించే నాయకుడు కావాలి. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నదే మా అకాంక్ష.



అమీన్‌పల్లిలో ఓటు వేసినరాయల్ శివప్రసాద్, కార్తీక దాసరి దంపతులు

అమీన్‌పల్లిలో ఓటు వేసేందుకు వచ్చిన మల్లికార్జున, సౌజన్య దంపతులు



నవీన్‌గౌడపై జేడీఎస్ ఎమ్మెల్యే సిట్‌కు ఫిర్యాదు

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ అంశం రోజుకో మలుపు తిరుగుతోంది. సోమవారం జేడీఎస్ ఎమ్మెల్యే అరకలగూడు మంజు బెంగళూరులో సిట్ అధికారులకు నవీన్‌గౌడపై ఫిర్యాదు చేశారు. నవీన్‌గౌడ ఫేస్‌బుక్ ద్వారా అరకలగూడు ఎమ్మెల్యే మంజుకు ఏప్రిల్ 21న పెన్‌డ్రైవ్ ఇచ్చానని, మారుతి కళ్యాణమండపం వద్ద కలిసిన తర్వాతనే పెన్‌డ్రైవ్ ఇచ్చినట్లు పోస్టు చేశారు. ఆ తర్వాతనే వైరల్ అయ్యిందని పోస్టు ద్వారా స్పష్టం చేశారు. ఈ మేరకు నవీన్‌గౌడ అబద్ధాలు చెబుతున్నారని ఫిర్యాదు చేశారు.

పెన్‌డ్రైవ్ వివాదంలో వారిద్దరికీ మినహాయింపా..?

పెన్‌డ్రైవ్ వివాదంలో జేడీఎస్, బీజేపీ నిందితులపై చర్యలు తీసుకుంటున్న సిట్ అధికారులు కార్తీక్‌గౌడ, నవీన్‌గౌడలను ఎందుకు మినహాయించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వారిద్దరిపైనా ఎఫ్ఐఆర్ నమోదై రెండు వారాలు ముగిసినా అరెస్టు చేయకపోవడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెన్‌డ్రైవ్ వివాదంలో డీసీఎంపై ఆరోపణలు చేసిన బీజేపీ నాయకుడు, అడ్వకేట్ దేవరాజెగౌడను లైంగిక వేధింపుల కేసులో అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి పంపారు. మరోవైపు బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడ ఆప్తుడు చేతన్, లిఖిత్‌లను ఆదివారం అరెస్టు చేశారు. కానీ మంత్రి జమీర్ అహ్మద్‌కు ఆప్తుడనే పేరొందిన బేశూరు నవీన్‌గౌడను ఈ వివాదంలో కీలకసూత్రధారి ప్రజ్వల్ మాజీ కారు డ్రైవర్ కార్తీక్‌గౌడను అరెస్టు చేయలేదు. ఇతడు చానెల్స్‌లో ఇంటర్వ్యూ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. పెన్‌డ్రైవ్ వివాదంలో అరెస్టు అయినవారు నా పీఏ కాదని మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడ తెలిపారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ పెన్‌డ్రైవ్, వీడియోలను చూడడం, ఇతరులకు పంపడం నేరమని, ఎవరూ అలాంటి చర్యలకు పాల్పడరాదని కార్యకర్తలకు సూచిస్తున్నట్లు తెలిపారు. హాసన్‌లో 2 లక్షల పెన్‌డ్రైవ్‌లు ఉన్నట్టు ప్రచారమవుతోందని, జిల్లాలో 15లక్షలమంది మొబైల్ వాడతారని, అందరినీ పరిశీలిస్తారా..? అంటూ ప్రశ్నించారు.